క్లుప్తంగా

కల్తీ మద్యం గుర్తించేందుకు యాప్

పుత్తూరు: మద్యం కొనుగోలు చేసేవారు ఏపీ ఎక్సైజ్ సురక్ష అనే యాప్ ద్వారా మద్యాన్ని తనిఖీ చేయాలని స్థానిక ఎక్సైజ్ సీఐ మురళీ మోహన్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పుత్తూరు, నారాయణ వనం, వడమాలపేట, రామచంద్రాపురం మండలాల్లోని ఏ4 షాపు లైసెన్స్, నౌకర్‌నామాలతో సమావేశం నిర్వహించి నకిలీ మద్యం అరికట్టడంపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. నకిలీ మద్యాన్ని అరికట్టడానికి ప్రభుత్వం తీసుకొచ్చిన సురక్ష యాప్‌ను కొనుగోలుదారులు డౌన్‌లోడ్ చేసుకుని తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

ఇనోవా, మినీలారీ ఢీకొని వ్యక్తికి గాయాలు


పాతర్యాడు వద్ద ప్రమాదానికి గురైన మినీలారీ, ఇనోవా

విజయపురం: మండలంలోని పాతర్యాడు సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలైంది. స్థానికుల వివరాల మేరకు.. తిరుత్తణికి చెందిన ప్రతీష్ (35) కారులో సొంత పనిపై పాతర్యాడు వస్తుండగా అదే సమయంలో ఇల్లత్తూరు నుంచి కనకమ్మసత్రం వైపు వెళ్తున్న టమాటా మినీలారీ పాతర్యాడు వద్ద ఇనోవా ఢీకొంది. ఈ ప్రమాదంలో ప్రతీష్‌కు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే తమిళనాడులోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. దీనిపై పోలీసుల వివరణ కోరగా సమాచారం అందలేదన్నారు.

పాల మిత్రలకు దీపావళి కానుక


పాల మిత్రలతో డెయిరీ నిర్వాహకులు

నగరి: మండల పరిధిలోని ఎం.కొత్తూరు గ్రామంలో శ్రీజ పాల ఉత్పత్తి కేంద్రంలోని 22 మంది పాలమిత్రలకు దీపావళి కానుకగా గురువారం మిక్సీలు పంపిణీ చేశారు. శ్రీజ మహిళా మిల్క్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేసినట్లు ఏరియా మేనేజర్ జ్యోతీశ్వరరెడ్డి తెలిపారు. పాల సేకరణ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కార్తీక్, లోకేష్, రఘు, పాలమిత్రలు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదగాలి


వీఓ మీటింగ్‌లో మాట్లాతుడున్న కల్పలతరెడ్డి

పాలసముద్రం: డ్వాక్రా సంఘాల్లో సంఘ సభ్యురాలు తీసుకుంటున్న వివిధ రకాల రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందుకు ఎదగాలని ఐకేపీ ఏపీఎం కల్పలత రెడ్డి తెలిపారు. గురువారం టీవీఎస్‌ఆర్‌పురం గ్రామంలో డ్వాక్ర సంఘాల మహిళలకు సీసీ చిరంజీవి సమీక్షంలో వీఓ మీటింగ్ జరిగింది. ఏపీఎం కల్పలతరెడ్డి మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లో తీసుకుంటున్న రుణాలను ఎక్కువగా పెట్టుబడి వచ్చేవాటిపై పెట్టి అధిక ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. తీసుకుంటున్న రుణాలను విచ్చలవిడిగా ఖర్చు పెట్టి వాటిని కంతుల ప్రకారం కట్టేందుకు కూలీలకు వెళ్లి అందులో వచ్చిన నగదును చెల్లిస్తున్నారు. ఇలా మండల పరిధిలోని చాలా గ్రూపులు జరుగుతోంది. స్త్రీనిధి ఉన్నతి రుణాల రికవరీపై శ్రద్ధ పెట్టాలని తెలిపారు. కార్యక్రమంలో డ్వాక్రా సంఘాల సభ్యురాలు పాల్గొన్నారు.

కరెంటు కోతల కట్టడికి చర్యలు

సాక్షి ఎఫెక్ట్..


విద్యుత్ అధికారులు అందించిన ఇన్సిలేటర్లు

చిత్తూరు రూరల్(కాణిపాకం): పల్లెల్లో కరెంటు కోతలపై విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. సాక్షి దినపత్రికలో గత రెండు రోజులుగా బీఎన్‌ఆర్‌పేట, తాళంబేడు సబ్‌స్టేషన్ పరిధిలో కరెంటు కోతలపై 'నిత్యం కోతలే', మ్యాన్ పవర్ కొరత అనే పేరిట కథనాలు వచ్చాయి. వీటిపై విద్యుత్‌శాఖ అధికారులు స్పందించారు. ఇన్సిలేటర్లు, కరెంటు తీగలను అవసరం మేరకు అందజేశారు. గురువారం 50 కరెంటు స్తంభాల్లో పగిలిన ఇన్సిలేటర్లను మార్పు చేశారు. మరో 10 రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు, కరెంటు కోతలకు ఆటంకం ఉన్న వాటిని సరిచేసి కోతలు లేకుండా చూస్తున్నామని శాఖ అధికారులు తెలిపారు.

ప్రమాదకరం..

పాత భవనం

పుత్తూరు పట్టణంలోని పురాతన మండపం ఇటీవల కాలంలో ఒక్కసారిగా కుప్పకూలింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇలాంటి పురాతన భవనాలు పుత్తూరు పట్టణంలో పదుల సంఖ్యలో ఉన్నాయి. ఎప్పుడు ఎలాంటి దుర్వార్త వినాల్సి వస్తుందోనని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చేపట్టాల్సిన బాధ్యత మున్సిపల్ అధికారులు నోటీసులో సరిపెట్టడంతో పురాతన భవనాలు కలిగిన ప్రాంతవాసులు భయాందోళనకు గురవుతున్నారు.

- పుత్తూరులో 50కి పైగా ఏళ్ల నాటి పురాతన భవనాలు
- వర్షాకాలం వస్తే చాలు వెంటాడుతున్న భయం
- తొలగించడానికి ముందుకురాని యజమానులు
- గత ప్రభుత్వంలో 13 భవనాల తొలగింపు
- ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో మళ్లీ టెన్షన్
- నోటీసులతో సరి పెట్టుకుంటున్న అధికారులు

పుత్తూరు: వర్షాకాలం వచ్చిందంటే పుత్తూరు పట్టణ వాసులకు కొత్త భయం వెంటాడుతోంది. కారణం పట్టణంలోని పలు ఏళ్ల నాటి పాత భవనాలు ఎప్పుడు కూలుతాయోనని, వర్షాలు, వరదల సమయంలో ఈ భవనాలు కూలి ప్రమాదాలు చోటు చేసుకున్న సమయంలో అధికారులు హడావుడి చేసి తర్వాత మిన్నకుండిపోతున్నారు. ఇటీవల వర్షాలకు స్థానిక కార్వేటినగరం రోడ్డులోని పురాతన మండపం కూలిపోయింది. ఆ సమయంలో మండపంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలకు అధికారులు తగిన చర్యలు చేపట్టాల్సి ఉంది. రెండేళ్ల కిందట పుత్తూరు పట్టణంలోని పురాతన భవనాలను గుర్తించి సదరు యజమానులకు మున్సిపల్ అధికారులు నోటీసులు జారీ చేశారు. నోటీసుల్లో స్వచ్ఛందంగా తొలగించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరిక చేస్తున్నారు. దీంతో కొందరు భవన యజమానులు స్వచ్ఛందంగా తొలగించారు.

125 ఏళ్ల ప్రభుత్వ ఆస్పత్రి భవనం

పట్టణంలో ప్రధానంగా 1900 ఏడాదిలో నిర్మితమైన ప్రభుత్వ ఆస్పత్రి భవనంలో నేటికీ వైద్య సేవలందిస్తున్నారు. ఈ భవనంలో హోమియో వైద్యశాలను నిర్వహిస్తున్నారు. ఆస్పత్రి అధికారులకు సైతం పురాతన భవనాన్ని తొలగించాలని గత ప్రభుత్వ హయాంలోనే నోటీసులు జారీ అయ్యాయి. అయితే నేటికీ అక్కడ వైద్య సేవలు నిర్వహిస్తుండడం పట్ల పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ భవనాన్ని తొలగిస్తే వాహనాల పార్కింగ్ సమస్య కొంతైనా తీరుతుందని ఆస్పత్రి వర్గాలే చెబుతున్నాయి. పట్టణంలోని ఎంబీ రోడ్డు, రామారావు, రామానాయుడు కాలనీలు, స్వామివీధి, జెండామాను వీధుల్లో సైతం పురాతన భవనాలు ప్రమాదకరంగా ఉన్నాయి. వీటిని తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గత ప్రభుత్వంలో 13 భవనాల తొలగింపు

గత ప్రభుత్వంలో ప్రజల క్షేమం కోరి పురాతన భవనాల తొలగింపు కార్యక్రమం జోరుగా జరిగింది. అప్పట్లో పుత్తూరు పట్టణంలో 52 పురాతన భవనాలను గుర్తించి నోటీసులు జారీ చేశారు. అందులో 13 భవనాలను అధికారుల పర్యవేక్షణలో తొలగించడం జరిగింది. మరో 29 పురాతన భవనాల్లో నివాసం ఉంటున్న వారి ఖాళీ చేయించారు. మిగిలిన 10 భవనాల యజమానులు ఖాళీ చేయాల్సి ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పురాతన భవనాల పరిసరాల్లోని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. అధికారులు స్పందించి పురాతన భవనాలను తొలగించాలని వారు కోరుతున్నారు.


స్వామి వీధిలో మరో పాత భవనం


ఎంబీ రోడ్డులో కూలడానికి సిద్ధంగా పాత భవనం


ఏళ్ల పురాతన ప్రభుత్వ ఆస్పత్రి భవనం


ప్రభుత్వ ఆస్పత్రిలోనే మరో భవనం

ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలి



వర్షాల నేపథ్యంలో విధిగా పురాతన భవనాల నుంచి ఖాళీ చేయాల్సిందే. భద్రతా చర్యల్లో భాగంగా సదరు పాత భవన యజమానులు సహకరించాల్సి ఉంది. అందరి మంచి కోరే పాతబడిన భవనాలను తొలగించాలని నోటీసులు ఇవ్వడం జరుగుతుంది. ప్రజలు సైతం స్వచ్ఛందంగా సహకరించాలి. –ఎం.మంజునాథ్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, పుత్తూరు

లబ్ధిదారులకు ఇసుక పంపిణీ చేయాలి

పుత్తూరు: స్థానిక చర్చి కాంపౌండ్‌లో ఇళ్ల నిర్మాణాల ఆప్షన్ 3 లబ్ధిదారుల కోసం నిల్వ చేసిన ఇసుకను త్వరితగతిన పంపిణీ చేయాలని హౌసింగ్ ఏఈని ఆదేశించినట్లు డీఈఈ శ్రీరాములురెడ్డి గురువారం మీడియాకు తెలిపారు. ఈనెల 16వ తేదీన పత్రికల్లో వచ్చిన అక్రమ ఇసుక డంపింగ్ వార్తా కథనాలపై ఆయన పైవిధంగా స్పందించారు. తిరుపతి జిల్లా హౌసింగ్ ప్రధానాధికారి ఆదేశాల మేరకు.. పుత్తూరు పట్టణంలో 1000 మెట్రిక్ టన్నుల ఇసుకను డంప్ చేసినట్లు ధ్రువీకరిస్తున్నట్లు స్పష్టం చేశారు. అవసరమైన లబ్ధిదారులకు వెంటనే ఇసుకను పంపిణీ చేయాలని, మండల ఇన్‌చార్జ్ ఆదేశించడంతో పాటు ఇసుక నిల్వలను సురక్షితంగా భద్రపరచాలని సూచించినట్లు వివరించారు. ఈ మేరకు జిల్లా హౌసింగ్ ప్రధాన అధికారికి నివేదిక పంపినట్లు వెల్లడించారు.

ప్రభుత్వ స్కూల్‌కు డెస్కుల విరాళం


తిరుమళరాజపుర హైస్కూల్‌కు దాత అందించిన డెస్కులు

పాలసముద్రం: మండలంలోని తిరుమళరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు గురువారం బెంగళూరుకు చెందిన పారిశ్రామికవేత్త బాబురాజు 25 డెస్కులు విరాళంగా అందించారని ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణరాజు తెలిపారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ బాబురాజు పాలసముద్రం మండలం వనదుర్గాపురం నివాసి అని, ఆయన అంచలంచెలుగా ఎదిగారన్నారు. అందుకే మండలానికి ఏదైనా చేయాలని ఉద్దేశంతో పాలసముద్రం, తిరుమళరాజుపురం హైస్కూళ్లలో విద్యార్థులు కూర్చుని చదువుకోవడానికి డెస్కులు, నోటుపుస్తకాలు అందించారు. పీహెచ్‌సీకి కూడా కొన్ని వస్తువులు ఇచ్చారని తెలిపారు. దాతకు గ్రామస్తులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కాపాడుకుందాం



మాట్లాడుతున్న కృపాలక్ష్మి, పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కృపాలక్ష్మి, నాయకులు, మహిళలు

- ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యకు కృషి చేద్దాం
- కూటమి ప్రభుత్వం అరాచాకాలను అడ్డుకుందాం
- జీడీనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం: కూటమి ప్రభుత్వం ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేయకుండా అడ్డుకుని కాపాడుకుందాం అని గంగాధరనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి అన్నారు. మండలంలోని ముద్దుకుప్పం పంచాయతీలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలను తీసుకురావడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వాటిని ప్రైవేటుపరం చేసేందుకు సిద్ధం కావడం బాధాకరమన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటుపరం చేస్తే ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు మెడికల్ విద్య దూరం అవుతుందని, కోట్లు పెట్టి మెడికల్ విద్యను కొనాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. పేద విద్యార్థులు అంత డబ్బు పెట్టి చదువుకోలేరని, వెంటనే ఈ పీపీపీ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జగనన్న ఆదేశాలతో కోటి సంతకాలు సేకరించాలన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ సంతకం చేయాలని, వాటిని గవర్నర్‌కు సమర్పించి ప్రైవేటు విధానాన్ని అడ్డుకోవాలన్నారు. అందుకు ప్రజల సహకారం ఉండాలన్నారు. అలాగే గ్రామాల్లో కూటమి ప్రభుత్వం చేస్తున్నా దౌర్జన్యం, దాడులు, అరాచకం, అక్రమ కేసులు వంటి వాటిని ధీటుగా ఎదుర్కొని వారి అరాచకానికి చరమగీతం పాడాలన్నారు. ప్రతి కార్యకర్తకు జగనన్న అండగా ఉండారని ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదన్నారు. కూటమి ప్రభుత్వం నుంచి ఎవరికైనా ఇబ్బంది కలిగితే వెంటనే జగనన్న డిజిటల్ బుక్‌లో నమోదు చేయాలన్నారు. మన ప్రభుత్వం రాగానే ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మణి, ఎంపీపీ సరిత, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, సర్పంచ్ శీనయ్య, గిరిబాబు, ఎంపీటీసీ సభ్యులు సిద్దయ్య, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్యదర్శి కాలప్ప, ఉమ్మడి జిల్లా బూత్ కన్వీనర్ వెంకటేష్‌రెడ్డి, రాష్ట్ర మేధావుల విభాగం కార్యదర్శి రాజన్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్యామ్ రాజ్, నాయకులు హరిప్రసాద్‌రెడ్డి, అల్లిముత్తు, వాసు, భూపతిరెడ్డి, రమణయ్య, సుబ్బారెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, మునిరత్నంరెడ్డి, రెడ్డెప్ప, నరేంద్ర, మోహన్, మణి, హరిరెడ్డి, రఘు, రామకృష్ణ, మహేష్, జయ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ


రఫీని పరామర్శిస్తున్న నారాయణస్వామి, కృపాలక్ష్మి

కార్వేటినగరం: మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ నాయకుడు రఫీ అనారోగ్యంతో పుత్తూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, జీడీ నెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి ఆస్పత్రికి చేరుకుని రఫీని పరామర్శించారు. వైద్యులను రఫీ ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు.

3 నుంచి మున్సిపల్ కార్మికుల సమ్మె


సమ్మె నోటీసు ఇస్తున్న సంఘ నాయకులు

నగరి: మున్సిపల్ కార్మికుల సమ్మె కాలంలో ఇచ్చిన హామీల అమలు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ కార్మిక సంఘం అనుబంధ సంస్థ అయిన ఏఐటీయూసీతో కలసి గురువారం మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డికి సమ్మె నోటీసు ఇచ్చారు. అందులో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సమస్యలను పరిష్కరించకుంటే నవంబర్ 3వ తేదీ నుంచి సమ్మె చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల జీతాల పెంపు, మున్సిపల్ కార్మికులు మృతి చెందిన కుటుంబం నుంచి ఒకరికి ఉద్యోగం, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఆప్కోస్ కింద చేర్చడం, డెయిలీ వేజ్ కింద పని చేస్తున్న వారిని అవుట్‌సోర్సింగ్ కిందకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. అలాగే కార్మికుల సంఖ్య పెంచాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు 30 శాతం పీఆర్సీ ప్రకటించాలని, ఇంజినీరింగ్ సిబ్బందికి జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. న్యాయమైన కోర్కెలు నెరవేర్చని నేపథ్యంలో సమ్మె తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘ నాయకులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 117 మంది ఎంపిక



ఎంపికైన అభ్యర్థులతో అధికారుల బృందం

నగరి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్‌మేళాలో 117 మంది ఎంపికైనట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ, సీడాప్, జేకేసీ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్ సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాలో 10 బహుళ జాతీయ సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు. మేళాలో మొత్తం 241 మంది పాల్గొనగా 117 మందికి ఉద్యోగాలు పొందారని వివరించారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ గుణశేఖర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ భాస్కర్ రాజు, జేకేసీ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ పంకజ, లాల్‌బాషా, రేవతి, గిరీష్‌కుమార్, చైతన్య, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

వ్యాను బోల్తా


బోల్తా పడిన వ్యాను

పుత్తూరు: పట్టణ పరిధిలోని పిళ్లారిపట్టు రోడ్డు వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అదుపు తప్పిన ఓ వ్యాను బోల్తా పడింది. అదే సమయంలో స్కూల్ పిల్లలతో అటు వైపుగా వచ్చిన స్కూల్ బస్సుకు ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వ్యాన్ డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

పేపర్ లోడ్ కంటైనర్ బోల్తా

రేణిగుంట: భద్రాచలం సారపాక ఐటీసీ కంపెనీ నుంచి తిరుపతి మీదుగా బెంగళూరు వైపు వెళ్తున్న ఐటీసీ పేపర్ లోడ్ కంటైనర్ లారీ గురువారం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటన మండలంలోని కేఎల్‌ఎం హాస్పిటల్ సర్కిల్‌లో చోటుచేసుకుంది. ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి గాజులమండ్యం పోలీసులు చేరుకుని పరిశీలించారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ


శిక్షణ ఇస్తున్న రీసోర్స్ పర్సన్స్

నగరి: ఘన వ్యర్థాల నిర్వహణ ఎంతో కీలకమైందని, దీని గురించి క్షుణంగా తెలుసుకుని ఆచరిస్తే చెత్త నుంచి సంపద సృష్టించవచ్చని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి వ్యర్థాల నిర్వహణపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నిబద్ధతతో అభ్యసించాలని సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ నగరి కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం రీసోర్స్ పర్సన్స్ శ్రీనివాస్, రమాదేవి శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, పురపాలక, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార కొరతపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న ప్రిన్సిపల్ చంద్రమౌళి

పుత్తూరు: మానవాళికి జీవనాధారమైన ఆహార కొరత, పోషకాహార లోపంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బి.చంద్రమౌళి తెలిపారు. గురువారం కళాశాలలో ఆర్థికశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాల్లో అధిక వినియోగం వల్ల ఆహార వ్యర్థం పెరుగుతోందని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఆహార కొరత, పోషకాహార లోపం తీవ్రమైన సమస్యగా ఉందన్నారు. సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. విద్యార్థి దశ నుంచే ఆహార అలవాట్లపై తగిన శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి ఒక్కరూ సున్నా ఆహార వ్యర్థం, ఆరోగ్యవంతమైన ప్రపంచం అనే నినాదంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆర్థికశాఖ విభాగాధిపతి టి.నరసింహులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో బెల్ట్‌షాపులు తొలగించండి

- పేద, మధ్యతరగతి కుటుంబాలు నాశనమవుతున్నాయి
- మండల సమావేశంలో సభ్యుల ధ్వజం


మాట్లాడుతున్న ఎంపీపీ మునివేలు

పుత్తూరు: గ్రామాల్లో బెల్ట్ షాపులను యథేచ్ఛగా నిర్వహించడం ద్వారా కుటుంబాలు నాశనమవుతున్నాయని గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు ధ్వజమెత్తారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ మునివేలు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఉత్తర పుకంద్రిగ సర్పంచ్ ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ పట్టణాల్లో మద్యం దుకాణాల్లో విక్రయించాల్సిన మద్యం గ్రామాల్లో ఏరులై పారుతోందని, దీంతో కూలి డబ్బులు మొత్తాన్ని మద్యానికే ఖర్చు చేస్తూ కార్మిక కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ అధికారులు గ్రామాల్లో తనిఖీలు నిర్వహించిన దాఖలాలు లేవని ఆరోపించారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల కట్టడికి తగిన చర్యలు చేపట్టాలని సభ్యులు ముక్కుమ్మడిగా డిమాండ్ చేశారు. ఇదే విషయంపై ఎంపీపీ మునివేలు మాట్లాడుతూ మండల సమావేశాలకు సైతం ఎక్సైజ్ అధికారులు హాజరు కాకపోవడం వారి నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలుస్తోందన్నారు. ఎందుకు సమావేశానికి రాలేదో ఎక్సైజ్ శాఖ వారిని వివరణ కోరాల్సిందిగా ఎంపీడీఓను ఆదేశించారు. ఇతర సభ్యులు మాట్లాడుతూ వీఎస్‌ఎస్ పురానికి ఆర్టీసీ బస్సులు నడపాలని, గ్రామాల్లో ఛిద్రమైన రోడ్లను బాగు చేయాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు మునస్వామిరెడ్డి, విమల, ఎంపీడీఓ శ్రీదేవి, డీటీ అశోక్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల అధికారులు పాల్గొన్నారు.

హొయల జిల్లేడుబుగ్గ..



చుట్టూ అడవులు.. పచ్చని చెట్లు.. ఎత్తయిన కొండలు ప్రకృతి అందాలకు నెలవైన జిల్లేడుబుగ్గ జలపాతం అందాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. జలపాతం హొయలు, పక్షుల కిలకిల రావాలు, పచ్చదనం అందాలు ప్రకృతి ప్రేమికులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రానికి 8 కి.మీ. దూరంలో ఐరాల, సోమల మండలాల సరిహద్దుల్లో 181 ఉప్పరపల్లె అటవీ ప్రాంతంలో ఈ రమణీయమైన జలపాతం ఉంది. కొండలపై నుంచి నీరు జాలువారుతోంది. ఈ జలపాతం తిలకించేందుకు స్థానికులే కాకుండా ఉమ్మడి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. స్నానాలు చేస్తూ కేరింతలు కొడుతున్నారు. సెల్ఫీలు దిగుతూ ఆనందంగా గడిపేస్తున్నారు. –ఐరాల